క్లుప్తంగా

నేడు కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

మోమిన్‌పేట: కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమానికి శనివారం స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ మోమిన్‌పేట్‌కు రానున్నట్లు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు శంకర్ తెలిపారు. ఉదయం 11 గంటలకు మండల కేంద్రంలోని రైతు వేదికలో కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. మండల పరిధిలోని ఆయా గ్రామాల నాయకులు, లబ్ధిదారులు, ప్రజాప్రతినిధులు హాజరు కావాలని కోరారు.

వేపాకు అలంకరణలో ఎల్లమ్మ



తాండూరు టౌన్: శ్రావణ మాసం మూడో శుక్రవారాన్ని పురస్కరించుకుని తాండూరు పట్టణం నెహ్రూగంజ్‌లోని శ్రీ రేణుకా నాగ ఎల్లమ్మ దేవాలయంలో అమ్మవారు వేపాకు అలంకరణలో దర్శనమిచ్చారు. పలువురు భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

ఉద్యోగులకు బదిలీలు సహజం



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న గ్రామస్తులు

యాలాల: ఉద్యోగ జీవితంలో బదిలీల ప్రక్రియ సహజమని, ఇది మరింత బాధ్యతగా విధులు నిర్వహించేందుకు దోహదం చేస్తాయని గిరిజాపూర్ కాంగ్రెస్ సీనియర్ నాయకులు హన్మంత్‌రెడ్డి, లక్ష్మయ్యముదిరాజ్ అన్నారు. శుక్రవారం మండలంలోని గిరిజాపూర్ ప్రాథమిక పాఠశాలలో బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయుడు రామకృష్ణను సన్మానించి వీడ్కోలు పలికారు. పాఠశాలలో విద్యార్థులకు చక్కటి విద్యాబోధన అందించిన ఆయనను ఈ సందర్భంగా అభినందించారు. అనంతరం రామకృష్ణ స్థానంలో కొత్తగా వచ్చిన ప్రవీణ్‌ను సన్మానించి స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఏఏసీ చైర్మన్ అనురాధరవి, నాయకులు వెంకట్, నర్సింహులు, బాజారప్ప, కిష్టప్ప, దేవేందర్‌గౌడ్, శ్రీను, సురేష్ పాల్గొన్నారు.

షాపుల అద్దె వేలానికి దరఖాస్తులు

పరిగి: మండల పరిషత్ పరిధిలో ఉన్న సామూహిక దుకాణ సముదాయాలకు వేలం నిర్వహిస్తున్నట్లు పరిగి ఎంపీడీఓ ప్రభాకర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీడీఓ కార్యాలయానికి అనుసంధానంగా ఉన్న దుకాణ సముదాయాల్లోని ఒక్కో షాపునకు నెలకు రూ.3,200 అద్దెగా నిర్ణయించారన్నారు. ఈ నెల 23వ తేదీ నుంచి సెప్టెంబర్ 4వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. దరఖాస్తు ప్రక్రియ అనంతరం వచ్చే నెల 5న దుకాణ సముదాయాలకు బహిరంగ వేలం నిర్వహిస్తామన్నారు.

సకాలంలో పాఠశాలకు చేరుకోవాలి

ఎంఈఓ వెంకటయ్య



కోటబాసుపల్లిలో ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న ఎంఈఓ

తాండూరు రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో ప్రార్థన సమయానికి ఉపాధ్యాయులు హాజరు కావాలని ఎంఈఓ వెంకటయ్య ఆదేశించారు. శుక్రవారం మండలం పరిధిలోని సంగెంకలాన్, మల్కాపూర్, కోటబాసుపల్లి, కోత్లాపూర్, గౌతపూర్ ప్రభుత్వ పాఠశాలలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ.. కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రతి పాఠశాలలో విద్యార్థులకు బేస్‌లైన్ టెస్ట్ నిర్వహించాలన్నారు. పాఠశాలలు ప్రారంభం నుంచి ఇప్పటి వరకు విద్యార్థి సామర్థ్యంపై పరీక్షలు పెట్టాలన్నారు. పరీక్షల అనంతరం విద్యార్థులను గ్రూపులుగా విభజించి చదువులో వెనుకబడిన వారిపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్‌ఎం వైద్యనాథ్, హెచ్‌ఎంలు రవీంద్రకుమార్‌శర్మ, శ్రీనివాస్, వినోద్‌కుమార్, లీలావతి ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

మనసున్న సారు.. మళ్లీ రావాలి మీరు

మంచి గురువును మించిన దైవం లేదని పెద్దలు ఆనాడే సెలవిచ్చారు. ప్రభుత్వ పాఠశాలలో ఉన్న కొద్దిపాటి వనరులను ఉపయోగించుకొని బోధనలో ప్రత్యేకత చాటారా ఉపాధ్యాయుడు. ఫలితంగా పేద విద్యార్థులతో ఆత్మీయ బంధాన్ని ఏర్పరుచుకున్నారు.

బదిలీపై వెళ్లిన సారే కావాలని విద్యార్థుల పట్టు

- రెండు రోజులుగా తరగతుల బహిష్కరణ
- మంతన్‌గౌడ్ తండా ప్రాథమిక పాఠశాలలో ఘటన



పాఠశాల గేటుకు తాళం వేసి ఆందోళన చేస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు



బదిలీ అయిన టీచర్ శేషగిరి

బషీరాబాద్: బదిలీపై వెళ్లిన సారే కావాలంటూ పాఠశాల విద్యార్థులు, వారి తల్లిదండ్రులు రెండు రోజులుగా ఆందోళన బాట పట్టారు. మండలంలోని మంతన్‌గౌడ్ తండా ప్రాథమిక పాఠశాలలో శేషగిరి అనే ఉపాధ్యాయుడు ఆరేళ్లుగా పని చేస్తున్నారు. ప్రత్యేక శైలిలో విద్యాబోధన చేయడంతో పాటు, విద్యార్థులను తన సొంత పిల్లలుగా చూసుకున్నారు. అలాగే గ్రామంలో యువతను ఏకతాటిపైకి తీసుకొచ్చి అనేక సేవా కార్యక్రమాలు చేపట్టి అందరి మనసులు గెలుచుకున్నారు. అయితే ఇటీవల జరిగిన ఉపాధ్యాయుల బదిలీల్లో భాగంగా శేషగిరి బషీరాబాద్ మండల కేంద్రంలోని జీపీ పాఠశాలకు బదిలీపై వెళ్లారు. 70మంది ఉన్నా మంతన్‌గౌడ్ తండా ప్రాథమిక పాఠశాలలో కొత్తగా ముగ్గురు ఉపాధ్యాయులు వచ్చారు.

పాఠశాల గేటుకు తాళం

తమకు పాత మాస్టారే కావాలని రెండు రోజులుగా ఆందోళన చేస్తున్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు సైతం పాఠశాలకు చేరుకొని శేషగిరి సారును తిరిగి పాఠశాలకు తీసుకురావాలని ధర్నాలు చేస్తున్నారు. శుక్రవారం మరో అడుగు ముందుకేసి సారు వచ్చే వరకు తమ పిల్లలను బడికి పంపమని, పాఠశాల గేట్లు బంద్ చేసి నినాదాలు చేశారు. ఈ సందర్భంగా తల్లిదండ్రులు మాట్లాడుతూ.. ప్రభుత్వం శేషగిరి సారును తిరిగి పంపకపోతే తమ పిల్లలను వేరే గ్రామానికి పంపిస్తామని, బడిని తెరవనివ్వమని హెచ్చరించారు. తండాకు చెందిన యువకులు కూడా అదే సారు కావాలని పాఠశాల ఆవరణలో బైఠాయించారు. శేషగిరి సారు బదిలీ రద్దు చేయాలని ఎంఈఓ దృష్టికి తీసుకెళ్లారు.

ఉన్నతాధికారుల పరిధిలో..

సాధారణ బదిలీల్లో భాగంగా శేషగిరి వేరే పాఠశాలకు వెళ్లారు. ఆయన బదిలీ రద్దు చేసి మళ్లీ అదే పాఠశాలకు పంపాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, గ్రామస్తులు కోరుతున్నారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాను. అప్పటి వరకు పిల్లలను బడికి పంపాలని వారి తల్లిదండ్రులను కోరుతున్నా.

– సుధాకర్‌రెడ్డి, ఎంఈఓ, బషీరాబాద్

'కాటమయ్య రక్ష కిట్'లు ఉపయోగకరం



రక్షణ కిట్‌పై అవగాహన కల్పిస్తున్న అధికారులు

కుల్కచర్ల: 'కాటమయ్య రక్ష కిట్'లు గీత కార్మికులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని కుల్కచర్ల మండల గౌడ సంఘం అధ్యక్షుడు మాలె కృష్ణయ్యగౌడ్, కిట్ ట్రైనర్ జశ్వంత్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని కాళమ్మ దేవాలయం పరిధిలో స్థానిక గీత కార్మికులతో కాటమయ్య రక్షణ కిట్ ద్వారా తాటిచెట్లను ఎక్కించి అవగాహనను కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అత్యంత ఎత్తులో గల తాటిచెట్లను ఎక్కే క్రమంలో కొంతమంది ప్రమాదవశాత్తు కిందపడిన సంఘటనలున్నాయన్నారు. అటువంటి పరిస్థితులు తలెత్తకుండా కాటమయ్య రక్షణ కిట్‌లు ఉపయోగకరంగా ఉంటాయన్నారు. కార్యక్రమంలో ఆబ్కారీ కానిస్టేబుల్ విష్ణువర్ధన్, స్థానిక గౌడ సంఘం నాయకులు శివకుమార్, ఆంజనేయులు, రాజు, రాంచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

జోరుగా సభ్యత్వ నమోదు



జక్కేపల్లిలో సభ్యత్వ నమోదులో వీరేశం

యాలాల: మండల పరిధిలోని పలు గ్రామాల్లో యువజన కాంగ్రెస్ సభ్యత్వ నమోదు అగ్గనూరు వీరేశం ఆధ్వర్యంలో జోరుగా సాగుతుంది. శుక్రవారం సాయంత్రం మండల పరిధిలోని జక్కేపల్లి గ్రామంలో పలువురు యువకులు కాంగ్రెస్ సభ్యత్వ నమోదును చేపట్టారు. ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి ఆదేశాల మేరకు సభ్యత్వ నమోదును చేపడుతున్నట్లు వీరేశం తెలిపారు. యువజన కాంగ్రెస్ అధ్యక్ష రేసులో తాను సైతం ఉన్నానని చెప్పారు. జక్కేపల్లితో పాటు మిగతా గ్రామాల్లో ఉదయం, సాయంత్రం వేళల్లో సభ్యత్వ నమోదు చేపట్టనున్నట్లు తెలిపారు.

ఉద్యోగ బాధ్యతల స్వీకరణ

మర్పల్లి: మండల కేంద్రంలోని యూనియన్ బ్యాంకు బ్రాంచి మేనేజర్‌గా టి.రమేశ్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇంతకు ముందు ఇదే బ్యాంకులో సీనియర్ సహాయకులుగా ఆయన పనిచేశారు. బ్యాంకులో గత మేనేజర్ బదిలీపై బంట్వారం మండలం తొర్మామిడి యూనియన్ బ్యాంకుకు వెళ్లారు. ఈ సందర్భంగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన మేనేజర్ రమేశ్ ఖాతాదారులతో మాట్లాడుతూ.. ప్రభుత్వం మాఫీ చేసిన రుణమాఫీ డబ్బులను వెంటనే అందజేస్తామన్నారు. కార్యక్రమంలో బ్యాంక్ సిబ్బంది, ఖాతాదారులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత

ఎంపీడీఓ మహేశ్‌బాబు



వైద్యులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ

దోమ: గ్రామాల్లో వ్యాధులు ప్రబలకుండా ప్రతి ఒక్కరూ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీడీఓ మహేశ్‌బాబు సూచించారు. శుక్రవారం మండల పరిధిలోని పెద్దతండా–చిన్నతండాలో మండల ప్రాథమిక ఆరోగ్య వైద్యాధికారి రజితతో కలిసి హెల్త్ క్యాంపును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తండాను చెందిన పలువురు కలుషిత నీరు తాగడంతోనే జ్వరాల బారిన పడ్డారన్నారు. ఈ నేపథ్యంలోనే క్యాంపును ఏర్పాటు చేశామన్నారు. ప్రజలు నివాస ప్రాంతాల చుట్టుపక్కల మురుగు నీరు నిల్వకుండా, పిచ్చిమొక్కలు పెరగకుండా చూసుకోవాలన్నారు. ప్రస్తుతం వానకాలం సీజన్ కావడంతో ఎక్కువ మంది వైరల్ ఫీవర్‌తో ఇబ్బందులు పడుతున్నారని, వారందరూ తగిన జాగ్రత్తలు తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీఓ సోమలింగం, పంచాయతీ కార్యదర్శి, అంగన్వాడీ టీచర్, ఆశ వర్కర్లు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నత్తనడకన హైవే పనులు

- దుమ్ముతో ఉక్కిరి బిక్కిరి
- ఇబ్బంది పడుతున్న వాహనదారులు



అధ్వానంగా మారిన అల్లాపూర్ రహదారి

తాండూరు రూరల్: జాతీయ రహదారి పనులు మండలంలో నత్తనడకన సాగుతున్నాయి. దీంతో వాహనదారులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. తాండూరు–చించోళి మార్గంలో వాహనాల రద్దీ ఎక్కువగా ఉంటోంది. ముఖ్యంగా తాండూరు మండలం అల్లాపూర్ నుంచి కోత్లాపూర్ వరకు 15 కిలో మీటర్ల దూరం ఉంది. గతేడాది మహబూబ్‌నగర్ జిల్లా భూత్పూర్ నుంచి కర్ణాటక రాష్ట్రం చించోళి వరకు నేషనల్ హైవే నంబరు 167 మంజూరైంది. సదరు కాంట్రాక్టర్ అల్లాపూర్ నుంచి జినుగుర్తి గేటు వరకు రోడ్డును తవ్వి కంకరవేసి వదిలేశారు. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అల్లాపూర్ వద్ద పెద్ద గుంతలు పడటంతో వాహనాదారుల రాకపోకలకు ఇక్కట్లు తప్పడం లేదు. కొన్ని వాహనాలు గుంతల్లో ఇరుక్కు పోయి ముందుకు కదలని పరిస్థితి దాపురించిందని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా హైవే అధికారులు, కాంట్రాక్టర్ స్పందించి రోడ్డు పనులు పూర్తి చేయాలని వాహనదారులు కోరుతున్నారు.



అల్లాపూర్–మామిళ్ల వద్ద నిలిచిన రోడ్డు పనులు

బీసీ గురుకులాన్ని తరలించొద్దు



కడా అధికారికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

దౌల్తాబాద్: మండలంలోని నీటూరు గ్రామంలో మంజూరైన బీసీ గురుకుల కళాశాలను తరలించవద్దని శుక్రవారం విద్యార్థి జేఏసీ నాయకులు కడా అధికారి వెంకట్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నీటూరు పరిసర ప్రాంతాల నందిగామ, కొడీడ్, నర్సాపూర్ గ్రామాల విద్యార్థులు చదువు కోవాలంటే నరక యాతన అనుభవిస్తున్నారన్నారు. తరతరాలుగా ఇక్కడి ప్రజలు విద్యకు ఆమడ దూరంలో ఉన్నారన్నారు. సీఎం చొరవతో ఈ ప్రాంతానికి కళాశాల మంజూరు అయితే, కొంతమంది స్వార్థపరులు తరలించడానికి ప్రయత్నిస్తున్నారన్నారు. కళాశాలను తరలిస్తే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. వినతిపత్రం అందజేసిన వారిలో పులిందర్‌గౌడ్, ఫయాజ్, రాజు, శివరాజ్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

• శ్రీవారి సేవలో మున్సిపల్ చైర్మన్



కొడంగల్: కొడంగల్ మున్సిపల్ చైర్మన్ జగదీశ్వర్‌రెడ్డి శుక్రవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. అంతకు ముందు తిరుమలలోని కల్యాణకట్టలో తలనీలాలు సమర్పించారు. మున్సిపల్ పరిధిలోని ప్రజలకు సేవ చేసే భాగ్యాన్ని వేంకటేశ్వర స్వామి కల్పించారని అన్నారు. శ్రీవారిని దర్శించుకున్న వారిలో తలారీ శేఖర్ ఉన్నారు.

• అంతారంలో శివాలయానికి భూమిపూజ

తాండూరు రూరల్: మండల పరిధిలోని అంతారం గ్రామంలో నూతన శివాలయానికి భక్తులు శుక్రవారం భూమిపూజ చేశారు. గ్రామంలోని శ్రీ ఆంజనేయస్వామి ఆలయం ఎదురుగా ఉన్న స్థలంలో పూజారి వెంకటాచారి శుక్రవార్ ఆధ్వర్యంలో అజయ్ దంపతులు భూమిపూజ చేశారు. కార్యక్రమంలో నాయకులు శ్రీను, శాంతు, రాజేందర్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, సంపత్‌కుమార్ పాల్గొన్నారు.

• అన్నదానం ఏర్పాటు

అనంతగిరి: అన్నదానం మహాదానమని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ సతీమణి సబితానంద్ అన్నారు. ఈమేరకు శుక్రవారం వికారాబాద్‌లోని బుగ్గ రామలింగేశ్వర స్వామి ఆలయంలో శ్రావణమాసం పురస్కరించుకుని కొనసాగుతున్న నిత్యాన్నదానంలో పాల్గొన్నారు. అంతకుముందు ఆలయంలో శివలింగానికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. ఆమె వెంట కౌన్సిలర్లు పావని, సంతోష, రాజ్యలక్ష్మి, దమయంతి, అనిత తదితరులు పాల్గొన్నారు.

• పరీక్షల సమయంలో ఒత్తిడి వద్దు

పెద్దేముల్: విద్యార్థులు పరీక్ష సమయంలో ఒత్తిడికి గురికాకుండా ప్రశాంతంగా ఉండాలని మానసిక వైద్యులు మనోజ్, ప్రియ సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో జిల్లా ఇమినైజేషన్ ఆఫీసర్ డాక్టర్ బుచ్చిబాబు ఆధ్వర్యంలో విద్యార్థులకు మెంటల్ అండ్ హెల్త్ స్ట్రెస్ మేనేజ్మెంట్ ప్రోగ్రాం ద్వారా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పలువురు వైద్యులు మాట్లాడుతూ.. విద్యార్థుల్లో మానసిక ఒత్తిడిని జయించి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు. దీనిపై కౌన్సెలింగ్ ఇవ్వడానికి రాష్ట్ర ప్రభుత్వం తరపున కళాశాలకు ఇద్దరు నిపుణులను పంపించారన్నారు. ముఖ్యంగా సమయాన్ని వృథా కాకుండా చూడాలన్నారు. సిగరెట్, డ్రగ్స్, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

• ముందస్తు కృష్ణాష్టమి వేడుకలు



దుద్యాల్: మండల పరిధిలోని హకీంపేట ప్రాథమిక పాఠశాలలో శ్రీ కృష్ణాష్టమి వేడుకలు ముందస్తుగా శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులు శ్రీ కృష్ణుడి, గోపికల వేషధారణతో ఆకట్టుకున్నారు. పాటలతో నృత్యాలు చేసి అందరిని అలరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శ్వేత, ఉపాధ్యాయులు సక్కుబాయి, అర్షియ బేగం, అస్మాసుల్తానా, సుభాశ్ తదితరులు పాల్గొన్నారు.

• 'ఉనికి కోసమే బీఆర్‌ఎస్ పోరాటం'

దౌల్తాబాద్: ఉనికిని కాపాడుకోవడం కోసమే రైతు రుణమాఫీపై బీఆర్‌ఎస్ రాజకీయాలు చేస్తుందని కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, మండల అధ్యక్షులు వెంకట్రావు, వీరన్న ఎద్దేవా చేశారు. శుక్రవారం వారు మండల కేంద్రంలో విలేకర్లతో మాట్లాడుతూ.. పదేళ్ల అధికారంలో ఉండి ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయని బీఆర్‌ఎస్ అధిష్ఠానం నేడు ధర్నాలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. వరంగల్ రైతు డిక్లరేషన్ సభలో రైతులకు రూ.రెండు లక్షలు రుణమాఫీ చేస్తామని రాహుల్‌గాంధీ ప్రకటించిన ప్రకారం సీఎం రేవంత్‌రెడ్డి అర్హులందరికీ అమలు చేశారన్నారు.

నూతన దంపతులకు ఆశీర్వాదం



వివాహ వేదికపై తిరుపతిరెడ్డి తదితరులు

కొడంగల్: నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో జరిగిన వివాహ వేడుకలకు కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి శుక్రవారం హాజరయ్యారు. బొంరాస్‌పేట కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నర్సిములుగౌడ్ కూతురు నిత్య వివాహం కొడంగల్‌లో జరిగింది. పెళ్లిలో పాల్గొన్న తిరుపతిరెడ్డి వధూవరులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో నాయకులు ముద్దప్ప దేశ్‌ముఖ్, ప్రశాంత్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉచిత విద్యుత్‌కు దరఖాస్తు చేసుకోండి

పరిగి: గృహజ్యోతి పథకంలో భాగంగా ఉచిత విద్యుత్ బిల్లులు పొందేందుకు మరొకసారి అవకాశం ఇస్తున్నమని పరిగి మున్సిపల్ కమిషనర్ వెంకటయ్య ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజాపాలన దరఖాస్తులలో మీటర్ల నంబర్లు ఎంట్రీ చేయని వారు ప్రస్తుతం నమోదు చేసుకునేందుకు మున్సిపల్ కార్యాలయంలో అవకాశం కల్పించామన్నారు. లబ్ధిదారులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి

నవాబుపేట: ప్రతి గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని మోమిన్‌పేట సర్కిల్ సీఐ ఆంజనేయులు సూచించారు. శుక్రవారం మండలంలోని లింగంపల్లి గ్రామంలో ఏర్పాటు చేస్తున్న సీసీ కెమెరాలను ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుత సమాజంలో సీసీ కెమెరాల అవసరం ఉందన్నారు. నేరాల అదుపులో సీసీ కెమెరాల పాత్ర కీలకం అన్నారు. ప్రతి గ్రామంలో దాతలు ముందుకు వచ్చి సీసీ కెమెరాలను ఏర్పాటు చేయించాలన్నారు. ఎస్సై అరుణ్‌కుమార్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

'కెమికల్ ఫ్యాక్టరీ నుంచి కాపాడండి'



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

ధారూరు: బయో కెమికల్ సుద్ద ఫ్యాక్టరీ నుంచి వెలువడే వ్యర్థాలతో మండలంలోని నాగసమందర్ గ్రామంలో పంటలు నాశనమవుతున్నాయని బీజేపీ మండల నాయకులు ఆరోపించారు. ఈ మేరకు శుక్రవారం తహసీల్దార్ సాజిదాబేగంకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఫ్యాక్టరీ నుంచి విష వాయువులు వెలువడి చుట్టూ వాయు కాలుష్యం వ్యాప్తి జరుగుతుందన్నారు. కెమికల్ ఫ్యాక్టరీ నుంచి వెలువడుతున్న పొగతో ప్రజల ఆరోగ్యాలు దెబ్బతింటున్నాయన్నారు. కంపెనీ నుంచి వెలువడుతున్న వ్యర్థాలు భూమిలో కలిసి భూగర్భ జలాలు కలుషితమవుతున్నాయని విచారం వ్యక్తం చేశారు. ప్రధానంగా చేతికొచ్చిన పంటలు పాడవుతున్నాయని తెలిపారు. సదరు కంపెనీపై తగిన చర్యలు తీసుకోవాలని తహసీల్దార్‌కు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు ఎం.రమేశ్, నాయకులు పాల్గొన్నారు.

అపరిచితులతో జాగ్రత్తగా ఉండాలి

ఎస్‌ఐ మధుసూదన్‌రెడ్డి



రేగడిమామిడిపల్లిలో అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ

పూడూరు: గ్రామాల్లో అపరచిత వ్యక్తులు సంచరిస్తే వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలని చన్గోముల్ ఎస్‌ఐ మధుసూదన్‌రెడ్డి సూచించారు. శుక్రవారం మండల పరిధిలోని రేగడిమామిడిపల్లి గ్రామంలో ఆన్‌లైన్ మోసాలు, బాల్యవివాహాలు, రోడ్డు ప్రమాదాల నివారణపై పోలీస్ కళాజాత బృందం చేత అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆన్‌లైన్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, నిత్యం ఎక్కడో ఓ చోట సైబర్ క్రైం కేసులు నమోదు అవుతున్నాయని అన్నారు. వాట్సాప్‌లలో వచ్చే తెలియని లింక్‌లను ఓపెన్ చేయరాదని అన్నారు. బాల్యవివాహాలు చేయడం నేరమని బలవంతంగా చేస్తే డయల్ 100కు నేరుగా ఫిర్యాదు చేయాలని తెలిపారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది అంజి, నిరంజన్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో అంతరిక్ష దినోత్సవం

కుల్కచర్ల: జాతీయ అంతరిక్ష దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం మండలంలోని ఇప్పాయిపల్లి జెడ్పీ పాఠశాలలో విద్యార్థులకు క్విజ్, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు పాండురంగయ్య మాట్లాడుతూ.. అంతరిక్షంపై భారతదేశం సాధించిన విజయాలకు గుర్తుగా వేడుక నిర్వహించామన్నారు. అనంతరం పోటీల్లో ప్రతిభచాటిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కిరణ్‌కుమార్, సరిత, రుక్మిణి, శివశంకర్, శ్యాంసుందర్, యాదయ్య, మహమూద్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు